12 బాలల సంరక్షణ కేంద్రాల గుర్తింపు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో 12 బాలల సంరక్షణ కేంద్రాలను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. బాలల సంక్షేమ సంస్థలను, 1 వీధి బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కేంద్రములను నిర్వహించుటకు జువెనైల్ జస్టిస్ బోర్డ్ నుండి అనుమతి కోరుతూ (ప్రభుత్వ నిర్వహణ కేంద్రాలు -2, ప్రభుత్వ శిశు గృహ -1, ప్రభుత్వేతర సంస్థల నిర్వహణ కేంద్రాలు -13) మొత్తము 16 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోగా, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి ఎన్. సూర్యలక్ష్మి, జిల్లా ఇంచార్జి జువెనైల్ ప్రొబేషన్ అధికారి ఓ.వి.ఎల్ సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ కార్యాలయపు అధికారులతో కూడిన కమిటీ సభ్యులతో జిల్లాలోని 16 బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీలు చేపట్టి, నిర్వహణకు అనువుగా వున్నటువంటి 12 బాలల సంరక్షణ కేంద్రాలను గుర్తించినట్లు వివరించారు. ఈ మేరకు ఆ 12 బాలల సంరక్షణ కేంద్రములకు శనివారం నిర్వహణ ధ్రువీకరణ పత్రములు (తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్) జారీ చేయడం జరిగిందన్నారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కోసం.

19న రైలు రోకో

-ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ



అరకులోయలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ: ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కోసం 20 న జరిగే క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం చేయాలనీ, ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న చేపట్టే రైల్ రోకో జయప్రదం చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. అరకువేలి గిరిజన ఉద్యోగుల భవనంలో జిల్లా కో కన్వీనర్ పొద్దు బాలదేవ్ అధ్యక్షతన జరిగిన ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ అరకువేలి, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల సమావేశంలో ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ చైర్మన్ కుడుముల కాంతారావు, ముఖ్య సలహాదారులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులన్నింటిని స్థానిక ఆదివాసులతోనే భర్తీ చేసే విధంగా మే 20 నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో ఆదివాసులకు అనుకూలంగా నిర్ణయం చేయాలన్నారు. అడ్వకేట్ జనరల్ ఫైనల్ లీగల్ ఒపినీయన్ ఇచ్చినప్పటికీ నూరు శాతం టీచర్స్ పోస్ట్ ల్లో ఎస్టీ లకు రిజర్వేషన్ పై ఉత్తర్వులు జారీ చేయకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. మెగా డిఎస్సీలో ఏజెన్సీ ఆదివాసీలకు నూరుశాతం టీచర్ పోస్టులు కేటాయిస్తూ ఉత్తర్వులు మే 15 నాటికి జారీ చేయాలాని కోరిన రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో మెగా డీఎస్సీ లో అదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరిగేలా వుందన్నారు.ఇప్పటికి స్పష్టమైన ఉత్తర్వులు ప్రభుత్వం జారీ చేయకపోడంతో అరకులో రైల్ రోకోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్. ధర్మన్నపడాల్, నాయకులు పి. అప్పలనర్సయ్య, సమిరెడ్డి మాణిక్యం, చట్టు మోహన్ వంతలా నాగేశ్వరావు, ఎం. రమేష్ కుమార్, పాంగి అశోక్ కుమార్, కిల్లో జగనాధం, గతుం బుజ్జిబాబు, గిరిజన ఉద్యోగుల జిల్లా మాజీ కార్యదర్శి సివేరి బాలకృష్ణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు, రాంబాబు, మల్లేష్, నాగేంద్ర, ఐసుబాబు, గుజ్జలి సురేష్, కొర్ర ప్రసన్న, జాన్ బాబు, కిలో దాసు, కాంగు శుభ, శర్మ, కాసులమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు



వినతిపత్రం ఇస్తున్న నేతలు

అరకులోయ రూరల్: ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నిర్వహించుటకు రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ లో ఆదివాసీలకు అనుకూల నిర్ణయం చేయాలని కోరుతూ ఈనెల 19న అరకు రైలు రోకో కార్యక్రమం చేపడుతున్నట్లు ఆదివాసీ స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం అరకు రైల్వే స్టేషన్ మాస్టర్ ను ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభ్యత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో రూల్ అఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఏజెన్సీ ప్రాంత స్థానిక ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. 5 వ షెడ్యూల్డ్ ఏరియాలో స్థానిక ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. కానీ మెగా డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంత లో సుమారు 4 వేల టీచర్స్ పోస్టులు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కో- కన్వీనర్స్ పొద్దు బాలదేవ్, చట్టు మోహన్, ఐసుబాబు, కిల్లో జగన్నాధం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : ఆదివాసీ స్పెషల్ డిఎస్సి తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న నిర్వహించనున్న అరుకు రైల్ రోకోను జయప్రదం చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సి కో కన్వీనార్లు రెయ్యల నాగభూషన్, వెంగడ జగన్‌లు శనివారం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోనీ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెగా డిఎస్సి నోటిఫికేషన్‌లో ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉద్యోగాలన్నీ ఆదివాసులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

హుకుంపేట: గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి, నూరు శాతం స్థానిక ఆదివాసులతోనే పోస్టులన్ని భర్తీ చేయాలని ఈనెల 19వ తేదీన అరకులో జరిగే రైల్ రోకోను జయప్రదం చేయాలని స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కో- కన్వీనర్ టి. క్రిష్ణ రావు, మహిళా విభాగం కన్వీనర్ ఎస్ హైమావతి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెగా డీఎస్సీతో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు బంద్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారే తప్ప, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేష్ ప్రకటిస్తామని స్పష్టత ఇవ్వలేదన్నారు. రైల్ రోకో కరపత్రాలు విడుదల చేశారు.



హుకుంపేటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు



చలివేంద్రం ప్రారంభిస్తున్న రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని

రేఖపల్లిలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ కేంద్రంలోని జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని శనివారం ప్రారంభించారు. ఎండలు తీవ్రతంగా ఉన్న నేపథ్యంలో బాటచారులకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ సరోజిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, పీసా కమిటీ సభ్యులు సారా పాండురాజు, కార్యదర్శి సూరి, గ్రామపంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఇఓపిఆర్డి శ్రీకాంత్ రెడ్డి, సిపిఎం మండల నాయకులు చీరపు తాతబాబు, ప్రకాష్‌రావు, హజరత్, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు....

రసాభాసగా టిడిపి మండల అధ్యక్ష ఎన్నిక

-ఓటింగ్‌కు ఒప్పుకోకపోవడంతో వాయిదా



హాజరైన నాయకులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: స్థానిక టిడిపి మండల అధ్యక్ష ఎన్నిక మండలంలో శనివారం రసాభసగా జరిగింది. మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో ఆ పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి వీ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల్ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ పోటీల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీ చేయగా రసాభాసగా సాగింది. ఐదుగురు పోటీదారుల మద్దతుదారులు తమకు అనుకూలమైన నాయకులకు అధ్యక్ష పదవి కేటయించాలని కోరడంతో ఇరుపక్షాల మధ్య మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చర్చలు జరగడంతో రసాభాసగా మారింది. ఓటింగ్ సిస్టం చేపట్టడానికి సిద్ధమైనప్పటికీ అభ్యర్థుల మద్దతుదారులు ఒప్పుకోకపోవడంతో ఈ ఎన్నిక ఆదివారానికి వాయిదా వేశారు.
ఇదిలా ఉండగా చర్చలు జరుగుతున్న సమయంలో అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన కొంతమంది అభ్యర్థులకు ఆ పార్టీ పైస్తాయి క్యాడర్ నుంచి విత్ డ్రా చేసుకోవాలని సంప్రదించి బుజ్జగింపులకు ప్రయత్నాలు చేసినా అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ విత్ డ్రా చేసుకునే అవకాశం లేదని, ఎలాగైనా పోటీలో ఉంటామని చెప్పినట్లుగా ఆ పార్టీ నాయకుల నుంచి సమాచారం. దీంతో నామినేషన్ వేసిన ఐదుగురు ఒక్కరు కూడా వెనకంజ వేయకపోవడంతో ఎన్నిక శనివారం నిలిచిపోవడంతో తిరిగి ఎన్నిక ప్రక్రియ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

బరిలో ఐదుగురు నేతలు

డుంబ్రిగుడ: త్వరలో టిడిపి చేపట్టనున్న మండల అధ్యక్ష పీఠంకు ఐదుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రస్తుతం టిడిపి అధికారంలో ఉండడంతో ఆ పార్టీ మండల అధ్యక్ష పీఠంకు మండలంలో పోటీ నెలకొంది. అధ్యక్ష పీఠం దక్కించుకోవడానికి మండలంలోని సీనియర్ నాయకులతోపాటు టిడిపి యువ నాయకులు ఐదుగురు పోటీ చేయడానికి సిద్ధంగా న్నారు. వారు వారికి అనుకూలమైన వారిని మచ్చిక చేసుకుని మద్దతు కూడ గట్టుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. మండలం నుంచి ప్రస్తుత టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు తో పాటు టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, మాజీ సర్పంచ్ ఆనంద్ రావు, గిన్ను, బి.కొమ్ములు నాయుడు బరిలో నిలబడెందుకు సిద్ధమవుతున్నారు. వీరు అధ్యక్ష పీఠం దక్కించుకోవడానికి తమకు అనుకూలమైన సీనియర్ నాయకులతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. పార్టీ కోసం పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే నాయకుడికి మండల అధ్యక్షుడిగా ఎన్నుకుంటే బాగుంటుందని స్థానిక మండలంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అది కూడా కష్టపడి గ్రామాల్లో తిరిగి పనిచేసే యువ నాయకులకు కేటాయిస్తే మరింతగా పార్టీ బలోపేతం అవ్వడానికి అవకాశం ఉంటుందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఆ పార్టీ అధిష్టానం కూడా మండలాల్లోని సీనియర్ నాయకులకు పై స్థాయి కేడర్‌లో పదవులు కొత్తవారికి మండల అధ్యక్ష పదవులు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ పార్టీ నాయకులు నుంచి సమాచారం. దీంతో స్థానిక మండలంలో నుంచి యువ నాయకులు మండల అధ్యక్ష పీఠం దక్కించుకోవడం కోసం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి-చింతపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజనులకు డోలీ మోతలు తప్పలేదు. చింతపల్లి మండలంలోని కీటుముల పంచాయతీ పరిధిలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలి జంబో (58) గత రెండు వారాలుగా తీవ్రమైన జ్వరంతో బాధ పడుతున్నాడు. గ్రామానికి రహదారి లేకపోవడంతో అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లడం కుటుంబానికి కష్టంగా మారింది. రహదారి, వాహన సదుపాయం లేని పరిస్థితుల్లో, గ్రామస్థుల సహాయంతో జంబోను డోలిలో నిమ్మలపాలెం నుంచి పులిగొంది వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు అడవి మార్గంలో మోసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేసి తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తాజంగి నుంచి అంబులెన్స్ సాయంతో జంబోను చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



తరలిస్తున్న కుటుంబీకులు



పాఠశాలలో భద్రపర్చిన పుస్తకాలు

పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలో పాఠశాలలు తెరిచిన వెంటనే పుస్తకాలు అందజేయడానికి కృషి చేస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి సూరయ్యా రెడ్డి శుక్రవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు ముందస్తుగానే పాఠ్యపుస్తకాలను తెప్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 46,045 పాఠ్య, నోటు పుస్తకాలు వచ్చాయని, వాటిని స్థానిక ఆశ్రమ పాఠశాలలో భద్రపరిచామని తెలిపారు. మండలంలో మొత్తం 98పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 6,256 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న నూకరాయితోట గ్రామస్తులు

పాఠశాల భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ నూకరాయితోటలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం వెంటనే నిర్మించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. పాఠశాల భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలకు భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.13లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, మంజూరైన నిధులతో పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రతి గ్రామంలోనూ చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి

-స్వచ్ఛాంధ్ర సాధనకు సహకరించాలి

-కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో స్వచ్ఛాంధ్ర సాధనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాడేరు జిల్లా గ్రామీణ నీటి సరఫరా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీట్ ది హీట్ స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వేసవిలో ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పశువులకు నీటి తొట్టెలు, పక్షులకు మేడ పైన నీటి కుండలు, గింజలు వేయాలని సూచించారు. అదేవిధంగా వైద్య, పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, నీటి వనరులు మెరుగుపరచే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ట్యాంకులలో క్లోరినేషన్ పరిశీలించారు. రూఫ్ రైన్ హర్వెస్టింగ్ కట్టడాలను పరిశీలించారు. ప్రతి ఇంటికి సోక్ పిట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మానవ హారం ఏర్పాటు చేసి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఆరోగ్య రథం వ్యాను ను ప్రారంభిస్తూ, ఈ వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద వేసవి చలివెంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్య క్రమాలలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా ఆర్ డబ్ల్యు ఎస్ అధికారి కె. జవహర్ కుమార్, డిపిఓ లవరాజు, డివిజినల్ పిఓ కుమార్, తహసిల్దార్ త్రినాథరావునాయుడు, ఎపిడి సీతయ్య, డిఎంహెచ్ఓ . జమాల్ బాషా, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

3వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-చింతూరు : 2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ చింతూరులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి మూడో రోజుకు చేరాయి. దీక్షలను ప్రారంభించిన సీనియర్ న్యాయవాదులు ఇల్లా చిన్నారెడ్డి, ఆత్రం నవీన్ మాట్లాడుతూ ఈ దీక్షలకు ఆదివాసీ సమాజం మొత్తం మద్దతు తెలియజేయాలని కోరారు. చిరుమూరు సర్పంచ్ కాకా అరుణ కుమారి దీక్ష శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలియజేశారు. జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి.నరేష్ మాట్లాడుతూ హక్కులను కాపాడుకోవడానికి ఆదివాసీ యువత కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లోబీరబోయిన రామకృష్ణ, అక్కిపల్లి వీరయ్య, అభిరామ్, లక్ష్మణ్, గంగూలీ, పులి శేఖర్, పూజారి రాహుల్, ప్రవీణ్, సాగర్, దుర్గారావు, అంజి, అశోక్, వేణు, పులి కన్నారావు, మూర్రం సత్తిబాబుతదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆదివాసీ జెఎసి నాయకులు

ప్రజలకు ఉత్తమ సేవలందిస్తే మంచి గుర్తింపు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం


ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రజలకు మంచి సేవలు అందించిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. డిప్యూటేషన్‌పై రంపచోడవరం ఎన్ఆర్ఇజిఎస్ ఎపీడీగా 15 నెలలపాటు విధులు నిర్వహించి మదర్ డిపార్ట్మెంటుకు బదిలీపై వెళుతున్న జి.శ్రీనివాసరావును శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు సేవ చేయడం చాలా సంతోషంగా భావించాలన్నారు. ఎప్పటికప్పుడు ఉపాధి పనులు పూర్తి చేయించడం, కొత్త పనులకు ప్రతిపాదన సమర్పించడం చేసిన శ్రీనివాసరావు సేవలు అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ ఎపీడీగా ప్రాజెక్ట్ అధికారి ఆదేశాలు ఎప్పటికప్పుడు పాటిస్తూ విధులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం అగ్రికల్చరల్ అధికారి ఎల్.రాంబాబు, వివిధ మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ ఏపీవోలు, సిబ్బంది శ్రీనివాసరావుకు పూలదండలు, సాలువాలతో సన్మానించారు. ఇన్‌ఛార్జి ఎపిడిగా బాధ్యతలు స్వీకరించిన బి.సత్యనారాయణ మాట్లాడుతూ మంజూరైన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు ఎప్పటికప్పుడు నిబంధనల ప్రకారం పూర్తి చేయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవోలు ప్రకాష్, స్వామి, మణి కుమారి, చిరంజీవి యాదవ్, వీరన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, ఇతర అధికారులు

మన్యంలో భారీ వర్షం



కొయ్యూరులో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చింతపల్లి, లంబసింగి ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. లంబసింగి నీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యాటకుల గుడారాలు ఎగిరి పోయాయి. రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ లేక ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు.

హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయతీ పి.చింతలవీధి గ్రామంలో గురువారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో, గురువారం సాయంత్రం నుంచి శనివారం వరకు గ్రామంలో కరెంటు లేక ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు సమస్యపై చెప్పడంతో లైన్మెన్లు గ్రామానికి వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ లేదని, వచ్చిన వెంటనే నూతనంగా పునర్దిస్తామని చెప్పడంతో గ్రామస్థులు చీకట్లో ఉంటున్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి కుండపోత కురిసింది. గత రెండు రోజులుగా చిరుజల్లులు పడగా, శనివారం ఒక్కసారిగా భారీ వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి పనులకు సిద్ధమవుతున్నారు. అయితే శనివారం కుండపోత వర్షం కారణంగా పలువురు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



చింతపల్లిలో కురుస్తున్న వర్షం



మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్



నూతన ఎంపిడిఒను సత్కరిస్తున్న సిబ్బంది

ఎంపిడిఒగా జిడివి.ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం అభివృద్ధి అధికారిగా జిడిపి.ప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రసాద్ ఎలమంచిలి ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై కొయ్యూరు వచ్చారు. ఇప్పటి వరకు ఈఓపిఆర్డి ఎస్‌కెవి.ప్రసాద్ ఇన్చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహించారు.

రత్నంపేటలో పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం రత్నంపేటలో నూతనంగా విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. పాల సేకరణ కేంద్రం వల్ల పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు రాజేష్ కుమార్, ప్రసన్న కుమార్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు

పరిహారం చెల్లింపునకు సత్వర చర్యలు : కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జాతీయ రహదారి భూములు కేటాయించిన వారికి పెండింగ్ పరిహారం చెల్లింపులకు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ, టూరిజం, జాతీయ రహదారి అధికారులతో జాతీయ రహదారి నిర్మాణం, పరిహారం చెల్లింపులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ రహదారి నిర్మాణంలో జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న రహదారులు, తాగునీటి పథకాలు, నీటి సరఫరా వనరుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పరిహారం చెల్లింపులలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులు చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత ప్రకారం చెల్లింపులు చేయాలని స్పష్టం చేశారు. పాడేరు లగిశపల్లి, పాడేరు కొయ్యూరు జాతీయ రహదారి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు అడిగితెలుసుకున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జాతీయ రహదారి అధికారులు గుల్షన్ కుమార్, రవి శేఖర్, తహశీల్దారులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసి గంగరాజు

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -అనంతగిరి:క్రికెట్ విజేతలకు మొదటి రెండవ బహుమతులను స్థానిక జెడ్పీటీసి దీసరి .గంగరాజు, ఎంపీపీ శెట్టి .నీలవేణి చేతుల మీదగా అందజేశారు. మండలంలోని ఎగువ శోభ పంచాయతీ పరిధి దిగుశోభ పొర్లుపొదూర్ గ్రామంలో సొంటిరి. సుబ్బారావు, మట్టం శ్యామ్ లు క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. ఈ ఆటలో మొదటి బహుమతి క్రికెటల్ ఎస్ సుబ్బారావు టీంకు మొదటి బహుమతి 20000, రెండవ బహుమతి జన్ని విజయ్ టీంకె 10000 అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ క్రీడా పోటీలలో యువత రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాంగి .దయాకర్, జన్ని, గుండు రాజు తదితరులు పాల్గొన్నారు.


బల్బులను పంపిణీ చేస్తున్న ఎంపీ తనూజారాణి

ఎల్ఇడి బల్బుల పంపిణీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఎంపీ నిధుల నుంచి రూ 11 లక్షల వ్యయంతో ఎల్ఈడి బల్బులు పంపిణీ చేస్తున్నట్లు అరకు ఎంపీ తనూజారాణి అన్నారు. మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం 18 పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు, కార్యదర్శులకు ఎల్ఈడి బల్బులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 256 వీధి. దీపాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి మారుమూల గిరిజన గ్రామాలకు వెలుగులు కల్పించాలని మండల ప్రజా ప్రతినిధులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటిసి జానకమ్మ, వైస్ ఎంపీపీ లలిత, ఆనందరావు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జులై 9న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- జిమాడుగుల:నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై జులై 9 దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సంయుక్తంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు ఈ మేరకు శనివారం జి మాడుగుల మండల కేంద్రంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ సమావేశం మోదకొండమ్మ అధ్యక్షతన జరిగింది. కేంద్రంలో బిజెపి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులకి తీవ్రమైన నష్టం జరుగుతుందని చెప్పారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలు కనుమరుగు అవుతాయన్నారు. కార్మికులకి నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉద్యమించాలని తెలిపారు. కనీస వేతనం 26,000 చెల్లించాలని, స్కీం వర్కర్లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలిపారు. నరేంద్ర మోడీ కార్పొరేట్లకు, ధనవంతులకు మేలు చేసే విధంగా కార్మిక చట్టాల మార్పులు తీసుకొచ్చారన్నారు. జులై 9వ తేదీన జి మాడుగుల కేంద్రంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం విధులు బహిష్కరించి నిరసన ర్యాలీలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు అన్నపూర్ణ, రత్నకుమారి రాజేశ్వరి ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పూజేశ్వరి, ఐకెపి వివోఏ నాయకులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు నేత ఉమామహేశ్వరరావు

స్పెషల్ డిఎస్‌సిపై ప్రభుత్వానికి నివేదిస్తా

ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జెసి అభిషేక్ గౌడ


జెసికి వినతిని ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన సంక్షేమానికే విధులు నిర్వహిస్తున్నామని ఇంచార్జి పిఒ జెసి ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. శనివారం ఐటిడిఎ సమావేశ మందిరంలో గిరిజన సంఘం, డిఎస్ సి సాధన కమిటి, గిరిజన ఉద్యోగుల యూనియన్, గిరిజన ప్రజా సంఘాల నేతలు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గిరిజన సంఘాల నేతలు చెప్పిన సమస్యలను సావధానంగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన స్పెషల్ డిఎస్ సిపై గిరిజన సంఘాలు ఇచ్చిన విజ్ఞాపన పత్రాలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం చర్చిస్తోందని, సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పలుమార్లు చర్చించారని తెలిపారు. గిరిజన సంఘాల నేతలు మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి స్పెషల్ డిఎస్ సి ప్రకటించాలని కోరారు.

ఎఎస్ పి ధీరజ్ మాట్లాడుతూ గిరిజన యువత హక్కుల కోసం పోరాడుతున్నారన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకు నిరాశ చెందకుండా కోర్టుకు వెళ్లి పునరుద్ధరించుకోవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో డిఎస్ పి షేక్ షెహబాజ్ అహ్మద్, డిఎస్ సి సాధన కమిటీ నాయకులు పి.అప్పలనర్స, కాంతారావు, కూడా రాధాకృష్ణ, వి.నాగేశ్వరరావు, చిన్ని, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.శేషాద్రి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అర్హులైన ప్రతి ఒక్కరు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని సిపిఎం సర్పంచ్ పాంగి సునీత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అర్హులైన లబ్దిదారుల నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే సచివాలయ ఉద్యోగులు ప్రతి రెవెన్యూ గ్రామంలో అవగాహన కల్పించి ప్రత్యేక శ్రద్ధతో ధరఖాస్తులు స్వీకరిస్తున్నారనీ సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జ్యోత్స్న , గసభ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, వార్డుమెంబర్స్ పాంగి. సత్యనారాయణ, డొడక. రాజు, సచివాలయం సిబ్బంది వార్డుమెంబర్స్ మోహన్ దాస్, ఫీసా ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం సర్పంచ్ సునీత

సాంకేతిక సమస్యలను చేయాలి

ప్రజాశక్తి అరకులోయ రూరల్: రాష్ట్రం ప్రభుత్వం రేషన్ కార్డులు మార్పులు, చేర్పులు ఆప్షన్ ఇచ్చారని కాని సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు పేర్కొన్నారు.శనివారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా రేషన్ కార్డు పొందేవారికి మార్పులు, చేర్పులు చేసుకునే వారికి నిబంధనలు లేకుండా గ్రామ సభ, పేసా కమిటీ, సచివాలయ అధికారి సిఫారసు మేరకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సాంప్రదాయ పెళ్లిలు చేసుకుంటున్నారని వారికి ప్రభుత్వం పెట్టిన షరతులు, నిబంధనలతో అనేకమంది గిరిజనులు కొత్త రేషన్ కార్డులు పొందలేకపోతున్నారన్నారు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికి గ్రామసభ, పేసా కమిటీల సిఫారసు మేరకు రేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. సచివాలయంలో నెట్వర్క్ సమస్యలతో సచివాలయ సిబ్బంది పనిచేయలేక పోతున్నారని గిరిజనులు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి సచివాలయాలు చుట్టూ పడిగాపులు కాసి మళ్లీ ఇంటి బాట పడుతున్న పరిస్థితి ఉందన్నారు. అన్ని సచివాలయ పరిధిలో నెట్వర్క్ సమస్యలు లేకుండా అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొర్రా మగ్గన్న, కిల్లో జగన్నాథం, తాంగుల హరి, కిలో సహదేవ్ పాల్గొన్నారు.

పలుచోట్ల తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-అరకులోయ:సింధూర్ యుద్ధంలో వీర మరణం పొందిన భారత యువ సైనికుడు మురళి నాయక్ స్ఫూర్తిగా దేశ ప్రజలు, యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు. వీర జవాన్లకు సంఘీభావంగా అరకులోయలో దొన్ను దొర ఆధ్వర్యంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి టౌన్షిప్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం, వైయస్సార్ జంక్షన్ వరకు నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదులకు మట్టు పెట్టడమే లక్ష్యంగా సింధూర్ యుద్ధం జరిగిందన్నారు. దీంతో పాకిస్తాన్ గుండెకు వణుకు పుట్టింది అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: పహాల్గంలో ఉగ్రవాదుల దాడి అత్యంత దుర్మార్గమని, ఆపరేషన్ సింధూర్ లో పాల్గొన్న సైన్యానికి హాట్సాఫ్ అని టిడిపి పాడేరు ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి అన్నారు. పాడేరులో భారత్ సైన్యానికి మద్దతుగా శనివారం తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయ జెండాలతో పట్టణ వీధుల్లో ర్యాలీ చేసారు. కూటమి నాయకులు మాజీ మంత్రి ఎం.మణికుమారి, వి.గంగులయ్య, బొర్రా.నాగరాజు, విజయరాణి, ఉమామహేశ్వరరావు, రాజారావు, కృష్ణారావు పాల్గొన్నారు

భూటాన్ బోధనా సంఘం కోసం ఇమ్మర్సివ్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భూటాన్‌లోని మారుమూల ప్రాంతాల నుంచి ప్రగతిశీల విద్యావేత్తలను వృద్ధి చెందుతున్న కమ్యూనిటీలోకి స్వాగతిస్తూ 'గ్యాలక్సీ ఎంపవర్డ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు శామ్‌సంగ్ ప్రతినిధి శ్యామ్ తెలిపారు. విద్యా రంగంలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, నిర్వాహకులకు సాధికారత కల్పించడం ద్వారా విద్యలో గణనీయమైన మార్పును తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024 డిసెంబర్‌లో భారతదేశంలో ప్రారంభించిన 'గ్యాలక్సీ ఎంపవర్డ్' కార్యక్రమం, తరచుగా ఆన్-గ్రౌండ్, ఆన్‌లైన్ లెర్నింగ్ ఈవెంట్‌ల ద్వారా భవిష్యత్తు దిశగా ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వర్క్‌షాప్‌లు, సహకార అభ్యాసం ద్వారా భూటాన్ ఉపాధ్యాయులు కూడా సాంకేతికత, ఆవిష్కరణలతో తరగతి గదులను పునర్నిర్వచించే ఈ ఉద్యమంలో భాగమయ్యారని తెలిపారు.

కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఈక్విటీ అండ్ ఈక్విటీ సంబంధిత రుణం, మనీ మార్కెట్, గోల్డ్, సిల్వర్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ పథకం అయిన కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను కెనరా బ్యాంకు మార్కెట్లో విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి రజనీష్ నరుల తెలిపారు. బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇది మార్కెట్ అవసరాలను తీర్చడానికి రూపొందించిన నూతన పథకమని అన్నారు. ఈ ఫండ్ దీర్ఘకాలిక మూలధన పెరుగుదలను అందించడం లక్ష్యంగా ప్రారంభించామని తెలిపారు. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తుందని, ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి సహకరిస్తుందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సంస్థ ఈక్విటీ హెడ్ శ్రీదత్త పాల్గొన్నారు.

మూగబోయిన ఎయిర్‌టెల్ నెట్‌వర్కు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ళ గ్రామంలో నిర్మించిన ఎయిర్ టెల్ టవర్ 20 రోజులుగా పని చేయలేదు. దీని కారణంగా ఫోన్ వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బ్యాలెన్స్ రోజులు వృధాగా పోతున్నాయని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ అప్‌డేట్ కూడా నిలిచిపోయింది. 20 రోజుల నుండి టవర్ పని చేయకపోయినా నేటికీ దానికి మరమ్మతులు చేయకపోవడంపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



ఎయిర్‌టెల్ సెల్‌టవర్

20న టిడిపి మినీ మహానాడు

ప్రజాశక్తి-రంపచోడవరం : తెలుగుదేశం పార్టీ రంపచోడవరం నియోజకవర్గం మినీ మహానాడు ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంప రోడ్డులోని భాను కళ్యాణ మండపంలో ఈ మినీ మహానాడు నిర్వహిస్తున్నామని, టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

బాపిరాజుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి రంపచోడవరం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చవలం బాపిరాజు కుమారుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన్ను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయ భాస్కర్ శనివారం పరామర్శించారు. మండలం లోని ఇర్లపల్లి గ్రామంలో బాపిరాజు స్వగృహం వద్ద నిర్వహించిన సంతాప సభలో ఎమ్మెల్యే పాల్గొని చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నం బాబురమేష్, వంతల రాజేశ్వరి, జీసిసి డైరెక్టర్ గొర్లె సునీత, పెంటపాటి అనంత మోహన్, అడబాల బాపిరాజు, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.


బాపిరాజుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేశిరీషాదేవి

160 మందికి నోటీసులు

ప్రజాశక్తి రాజవొమ్మంగి : స్థానికంగా జాతీయ రహదారికి ఇరువైపులా స్థలాలను ఆక్రమించిన 160 మందికి నోటీసులు అందజేశామని తహశీల్దార్ సత్యనారాయణ శనివారం తెలిపారు. 15రోజుల్లోగా ఆక్రమించిన ఆర్ అండ్ బి స్థలాలను ఖాళీ చేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఆర్ఎ, వీఆర్ఓలు ఈ నోటీసులు అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా దుకాణాలు, ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నామని, ఆకస్మికంగా ఖాళీ చేయమంటే ఎలా బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.


దుకాణదారులకు నోటీసులిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పలుచోట్ల స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : స్వచంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డుంబ్రిగుడ మండల కేంద్రంలో అరకు ఆటవి రేంజ్ అధికారి శ్రీనివాస్, అటవి సిబ్బంధి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఎం గీత మాట్లాడుతూ, భవిష్యత్తు తరాలకు నీటి సంరక్షణ చాలా అవసరమని, సంరక్షణ పద్దతులు, ట్రెంచులు తవ్వడం వంటి పనులు చేపట్టాలన్నారు. ఈ వేసవిలో మట్టి కుండలతో నీటి సధుపాయం చేయాలని చెప్పారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరావు, అటవీ శాఖ అధికారులు అప్పన్న, రేణుఖ, బీట్ ఆఫీసర్ పి ఉద్దంగి, పీసీసీ డెలిగేట్ సభ్యుడు పి చిన్నస్వామి, పరశురామ్ పాల్గొన్నారు.

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛం, స్వర్ణాంధ్ర కార్యక్రమం మండలంలో నిర్వహించడం జరిగిందని స్థానిక ఎంపీడీవో ఏ వివి కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి పాల్గొన్నారు. ముందుగా పంచాయతీ ప్రధాన కూడలి వద్ద చలివేంద్ర ఏర్పాటు చేశారు. పెద్దూరు గ్రామంలో స్థానిక వైద్య అధికారిణి జ్ఞానేశ్వరి ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల .రూతు, జె.అప్పారావు, ఏపీవో నాయుడు, గిరిజన సంఘం నాయకులు ఎస్.నాగులు, ఎనెమ్.సంధ్య పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో మొక్కను నాటుతున్న ఎంపిటిసి

పాడేరు: కలెక్టరేట్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. కలెక్టరేట్ లోని కార్యాలయాల శుభ్రతతో పాటు, ఆవరణలో ఉన్న పార్కును శుభ్రపరచి, మొక్కాలు నాటారు. బీట్ ది హీట్‌లో భాగంగా చలి వెంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. పద్మలత, జిల్లా పౌర సరఫరాల అధికారి బి. గణేష్, కలెక్టరేట్ ఎఒ ఎం. బాష్కర అప్పారావు, పర్యవేక్షకులు తిరుమల రావు, పౌర సరఫరాల ఉప తహసిల్దార్ ప్రశాంత్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సమాచార పౌర సంబంధ శాఖ కార్యాలయంలో డిపిఆర్ఓ గోవింద రాజులు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మరుగుదొడ్డిని శుభ్ర పరచారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ పౌర సంబంధాల అధికారి పి. రాములు, సీనియర్, జూనియర, రికార్డు సహాయకులు పి. శ్రీనివాసరావు, కె. సంధ్యా రాణి, కె.మోహన్ రావు పాల్గొన్నారు.

విశాఖ జూ పార్కులో కొత్త నేస్తాలు!

కూనలకు జన్మనిచ్చిన అరుదైన జంతు జాతులు : సంతానోత్పత్తి కేంద్రంగా జంతు ప్రదర్శనశాల


విశాఖ జూ పార్కులో కొత్తగా జన్మించిన తోడేలు, నక్క, లేమూర్ కూనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో అరుదైన జాతులకు చెందిన జంతువులు కూనలకు జన్మనిచ్చాయి. ఒక తోడేలు పిల్ల, ఒక బెంగాల్ జాతికి చెందిన ఒక నక్క పిల్ల, మడగాస్కర్‌కు చెందిన లేమూర్ పిల్లలు కొత్తగా జన్మించాయి. అంతరించిపోతున్న షెడ్యూల్ -1 జాతికి చెందిన తోడేలు ఒక పిల్లకు జన్మనివ్వడం చాలా సంతోషంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇటీవల కాలంలో జూపార్కులో వివిధ జాతుల జంతువులు పిల్లలను కంటున్నాయని, జూ పార్కులో జంతువుల సంతోనోత్పత్తికి, వాటి పరిరక్షణ వైపు ఒక ప్రధాన అడుగు పడిందన్నారు. దీనికోసం జూ అధికారులు, పశువైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. దీని వెనుక జూ సిబ్బంది అంకితభావంతో కూడిన కృషి, జంతు సంరక్షణ, సంతానోత్పత్తి కార్యక్రమంలో వారి నైపుణ్యం ఉందన్నారు. అందమైన కొత్త జంతువులను త్వరలో చూడవచ్చన్నారు.

ఎపిఇపిడిసిఎల్‌తో సిపిఆర్ అవగాహన


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎపిఇపిడిసిఎల్ సిఎండి, సిపిఆర్ సిజిఎం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ డేటా ఆధారిత నిర్ణయాలను బలోపేతం చేసుకొనేందుకు సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సిపిఆర్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సిజిఎం పి శ్రీనివాస్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ ప్రెసిడెంట్ చొక్కాకుల శ్రీనివాస్ ఎంఒయుపై సంతకాలు చేసారు. ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, మున్సిపల్ శాఖ వంటి అనేక శాఖలతో కలిసి పనిచేసిన అనుభవంతో ఇకపై ఎపిఇపిడిసిఎల్‌తో పని చేయనుంది. యాక్సిస్ బ్యాంక్ మాజీ చీఫ్ ఎకనమిస్ట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ ప్రస్తుత సభ్యుడు శౌగత భట్టాచార్య పర్యవేక్షణలో సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఎపిఇపిడిసిఎల్‌కు సహకరించనుంది. విద్యుత్ పంపిణీ సామర్థ్యవృద్ధి, ఆదాయవృద్దే లక్ష్యంగా సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఎపిఇపిడిసిఎల్‌కు డేటా ఆధారిత విశ్లేషణలు చేయడంతో పాటు సంస్థ సిబ్బందికి అధ్యయనాలు, సూచనలు చేయనుంది. ఎపిఇపిడిసిఎల్‌లో ఏర్పాటు చేసిన డేటా అనలిటిక్ యూనిట్ (డిఎయు)ను అభివృద్ధి పరచడం ద్వారా సంస్థ అంతర్గత వ్యవస్థ సామర్థ్యాలను పెంచడం, బిల్లింగ్ వ్యవస్థలోని రెవిన్యూ నష్టాలను తగ్గించడం, క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి డేటా విశ్లేషణలు, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడంలో బలోపేతం చేయడంపై సిపిఆర్ సహకరిస్తుంది.

20న విశాఖ ఉక్కు సమ్మెను జయప్రదం చేయాలి



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 20న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.రామారావు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 1556వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు, కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు.

కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై యాజమాన్యం తన మొండివైఖరిని నిలువరించే విధంగా సమ్మె జరగాలన్నారు. ప్లాంట్‌కు లాభాలు వస్తున్నప్పటికీ కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం యాజమాన్య దుర్మార్గానికి నిదర్శనమన్నారు. ఇదే పద్ధతిని యాజమాన్యం అనుసరిస్తే పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు పుల్లారావు, అప్పలరాజు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, కృష్ణారావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.